

# గిన్నిస్ బుక్

శాఖమూరి శ్రీనివాస్

ఆ పోలీస్ స్టేషన్ ముందు హడావుడిగా వుంది. పెద్ద షామియానా, దాని కింద వరుసగా బల్లలు వున్నాయి. ఓ యాభై అట్టపెట్టెల్ని తీసుకొచ్చి తెరిచి, బయటకు తీసిన 'మందుగుండు' సామగ్గిని అందంగా బల్లలపై అమర్చారు. ఈగల్లా ముసిరిన మీడియా ప్రతినిధులు వాటిని ఫోటోలు, వీడియో తీయడంలో పోటీపడ్డారు. పాము బిళ్లలు, వెన్న ముద్దలు మొదలుకొని అతి భయంకర శబ్దాలనిచ్చే లక్ష్మీ బౌంబ్లు, తాటాకు టపాసులు, అవ్వాయి చువ్వాస్, మిరపకాయల జడలు... అబ్బో గత ఇరవై సంవత్స రాల వెరైటీలన్నీ వున్నాయి.

"సార్ వస్తున్నాడు... దయచేసి మీరెళ్లి మీ సీట్లలో కూర్చోండి" ఓ పోలీస్ అనౌన్స్ చేయడంతో విలేకరులంతా తమ స్థానాల్లో ఆసీనులయ్యారు.

నున్నగా షేవ్ చేసుకొని, ముఖాన నవ్వుల పువ్వులు పూయిస్తూ వచ్చాడు ఆ పోలీస్ బాస్. పోలీసులందరూ అటెన్షన్‌లోకొచ్చారు. తన ప్రసంగాన్ని మొదలుపె ట్టాడతను.

"డియర్ ఫ్రెండ్స్...మిమ్మల్నిక్కడికి పిలిపించింది, ఓ భయంకరమ్మైన కుట్రను ఛేదించామని.... ఓ భారీ ప్రేలుడును నివారించామని చెప్పడానికే....!"

'ఎలా సార్!... మీరింత ఎఫీషియంట్‌గా ఎప్పుడు మారారు?' ఓ విలేకరి రాసు కొని, దాచుకుని అడిగిన ప్రశ్న.

'వుయ్ ఆర్ ఆల్వేస్ ఎఫిషియంట్ మిస్టర్... మీ మీడియానే గోరంతను కొండంతలు చేసి, అల్ప విషయాన్ని కూడా చిలువలు పలువలు చేసి మమ్మల్ని అసమర్థులుగా చిత్రిస్తుంది. ఓ.కె. .. విషయానికొస్తాను. ఈ బల్లలపై పేర్చినవన్నీ

ఒకే వ్యక్తి 'డెన్'లో దొరికాయంటే మీరు నమ్మలేరు. కానీ, నిజం! ఎన్నో సంవత్సరాల నుంచి వీటిని కూడబెడుతూ వచ్చాడతను.'

'మీరెన్నేళ్లు నిఘా వేసి పట్టుకున్నారు?' మరో తుంటరి విలేకరి ప్రశ్నాశరం.

'రెండు సంవత్సరాల నుంచీ ఇన్ఫర్మేషన్ కలెక్ట్ చేస్తున్నాము. ఎనీ హౌ....వుయ్ ప్రివెంటెడ్ దట్.'

'ఇందులో మీ పరిశోధనకన్నా ఓ పదేళ్ల పిల్లవాడు అందించిన సమాచారమే ఎక్కువని రూమర్!' మరో ప్రశ్న.

ప్రశ్న అడిగిన వాడిని లాకప్‌లో వేసి తడాఖా చూపాలన్న కోరికను బలవంతాన ఆపుకొని... ఆ విలేకరి వైపు తగిలించుకున్న చిరునవ్వుతో చూస్తూ....' మీరే అంటున్నారు కదా రూమరని! దానిపై నో కామెంట్' బాస్ లౌక్యాన్ని ప్రదర్శించాడు.

'డీటెయిల్స్ చెప్పండి సార్...'

'ఓ..కె... లెటజ్ కమ్‌టుది పాయింట్... ఈ సామానంతా (బాణాసంచా) లింగమూర్తి అనే ఓ ఆటంకవాదిది. అతను వీటిని ఇరవై సంవత్సరాల నుంచి 'సేకరించి దగ్గర పెట్టుకున్నాడు' మధ్యలో ఆపి పోలీసులకు సైగ చేశాడు.

పోలీసులు లింగమూర్తిని వెంటబెట్టుకువచ్చారు. చేతులకు బేడీలు...కాళ్లకు, మెడకు రింగులు...వాటిని జాయింట్ చేస్తూ గొలుసులతో ఓ అంతర్జాతీయ తీవ్రవాది లాగున్నాడు లింగమూర్తి. ఆ బక్కపలుచని బలిని బంధపుగొలుసులు కృంగదీస్తున్నాయి. బాధను పంటి బిగువున దాచుకుంటూనే మెల్లగా వచ్చి, పోలీసులు చెప్పినట్లు బాస్ ఎదురుగా కింద కూర్చున్నాడు. కెమెరాల మెరుపులు, ఓ నిమిషం పాటు లింగమూర్తిని ముంచెత్తాయి.

వీణ వెంటనే లాయర్ని సంప్రదించడం, విడాకుల నోటీస్ లింగమూర్తికి వెళ్లడం చకచకా జరిగిపోయాయి. జైల్లో ప్రత్యేకంగా ఓ సెల్లో వున్న లింగమూర్తి ఆ నోటీస్‌లోని పదాల్ని ఎన్ని వందలసార్లు చదివాడో! వీణ మీద వుప్పొంగిన ప్రేమ కన్నీరై జారింది.

మధ్యలో ఆగిన వివరణ మళ్లీ మొదలైంది.

'ఈ ప్రేలుడు పదార్థాలతో బ్రిడ్జీలు కూల్చొచ్చు. వివిపిలను చంపొచ్చు. టిఫిన్ బాంబులు, కుక్కర్ బాంబుల్లాగా మార్చి జనసమ్మర్ద ప్రాంతాల్లో విధ్వంసాన్ని సృష్టించవచ్చు. ఎనీథింగ్ ఈజ్ పాజిబుల్.'

'ఈ దీపావళి సామానుతో అంతంత పనులు కూడా చెయ్యొచ్చా!' ఓ క్రాస్ ఎగ్జామినేషన్ క్వశ్చన్.

'బహుశా ఇలాంటి న్యూస్ కలెక్ట్ చేయడం నీకు కొత్తయి వుంటుంది. చూడ్డానికి ఇవన్నీ దీపావళి మందులే! కలిపి కాలిస్తే?! ఎక్స్‌పెక్ట్ దట్ ఎక్స్‌ప్లోజివ్... చాలా తీవ్రంగా వుంటుంది. నష్టం అపారమవుతుంది.'

'ఈ విజయంపై మీ కామెంట్'

'ఇలాంటి కేసులు ఎన్నైనా పట్టేసే చేవ కలిగిన వాళ్లం. దేశంలో ఇంత భారీ ఎత్తున విస్ఫోటకాలు పట్టుబడడం ఇదే ప్రథమం. ఐ థింక్...స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులు కూడా ఇలాంటి కేసులు డీల్ చేసి వుండరు. వున్నా...నిందితుల్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని వుండర్రు. ఈ సందర్భంగా మా సబార్డినేట్స్‌కు ధన్యవాదాలు చెపుతూ రివార్డ్ ప్రకటిస్తున్నాను.

పరిసరాలన్నీ చప్పట్లతో మారుమోగాయి.

ప్రసంగం పూర్తయింది. న్యూస్ ఛానెళ్ల వీడియో చిత్రీకరణలో మందుగుండు సామాగ్రిని పరిశీలించాడు బాస్. దీపావళికి ఇన్ని రకాల బాణాసంచా కాలుస్తారని ఇంతవరకూ తనకు తెలియదు.! అందుకే కొన్ని రకాలు చేసినప్పుడు ముఖంలో ఎంతో ఆశ్చర్యం. తెలియని వాటి గురించి జూనియర్ ఆఫీసర్లు లోగొంతుతో బాస్‌కు వివరిస్తున్నారు.

అన్నింటిని పరిశీలించడం అయిపోయింది. నక్సలైట్ల ఆయుధాలు దొరికినప్పుడు వాటితో గురిచూస్తున్నట్లే... ఓ నేల టపాకాయ తీసుకొని దూరంగా విసిరాడు బాస్. తుస్సుమంది! ఓ అవ్వాయిసువ్వ తీసి అంటించి వదిలాడు. అది రెండడుగుల పైకి లేచి వెంటనే నేలకు జారి భూచక్రంలా మారి కాసేపు అందరిని చిందులు వేయించింది.

'సార్...వీటి ఎక్స్‌పైరీ డేట్ అయిపోయి చాలా రోజులైంది.... ఓ కుర్ర ఆఫీసరు బాస్ చెవిలో ఊదాడు.

'షటప్ ఐ సే' .... విలేకరులవైపు కళ్లు తిప్పి చూపిస్తూ, ఆ టాపిక్‌ను అంతటితో కట్ చేయించాడు బాస్.

తన ట్రయల్స్ ఆపి అందరికీ వీడ్కోలు చెప్పి వెళ్లాడు.

ఇక ఈగలన్నీ లింగమూర్తిపై వాలాయి.

'ఏ తీవ్రవాద సంస్థకు చెందిన వాడివి?'

....

'ఇంతకీ నీ టార్గెట్ ఏమిటి?'

......

'ఇంత మందుగుండును ఇరవై ఏళ్ల నుంచి ఇతరు కంటబడకుండా ఎలా దాచావు?'

......

లింగమూర్తి నుంచి రెస్పాన్స్ లేకపోవడంతో అంతా నిరాశపడ్డారు. సమాధానాలు ఇస్తూ పోతో ఎన్ని రోజులైనా ప్రశ్నల మీద ప్రశ్నలడగగలిగిన సమర్థులు వాళ్లు...

'తప్పదు... మా ప్రశ్నల్లో ఒక్కదానికైనా నువ్వు సమాధానమివ్వాలి!' ఆవేశం తట్టుకోలేని ఓ విలేకరి కటువుగా అడిగాడు.

ఏమీ మాట్లాడకుండా తెల్లకాగితం, పెన్నుతెప్పించుకొని 'గిన్నీస్ బుక్' అని రాసి అందరికీ చూపాడు లింగమూర్తి.

'అంటే... గిన్నీస్‌బుక్‌లో రికార్డయ్యేంత పెద్ద ప్రేలుడుతో విధ్వంసాన్ని సృష్టించడమే నీ లక్ష్యమా?'

'ఉహూ' తల అడ్డంగా వూపుతూ మళ్లీ 'గిన్నీస్ బుక్' అన్న పదాన్నే, చూపాడు లింగమూర్తి.

'గిన్నీస్ బుక్'కు తమకు తోచిన విధంగా భాష్యం చెప్పుకొని వారి వారి ప్రసార మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేశారు విలేకరులు.

మొత్తానికి లింగమూర్తికి 'లాడెన్' అంత పాపులారిటీ వచ్చింది. అతని వ్యూహాల్ని, సంఘ వ్యతిరేక చర్యల్ని చూసిన, చదివిన ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం భగ్గుమంది. అతడిని ఒకసారి కాదు....పదిసార్లు ఉరి వేసినా తప్పులేదని ఫోన్లు, ఎస్ ఎమ్ ఎస్‌ల ద్వారా తమ అభిప్రాయాలను టీవీలకు న్యూస్‌పేపర్లకు తెలిపారు.

లింగమూర్తి భార్య వీణ కూడా భర్త దుర్మార్గాల్ని, కుట్రను వీక్షించింది. తనకు తల కొట్టేసినట్లయింది. స్నేహితులు, బంధువుల నుంచి వరుసగా వచ్చే ఫోన్లు వీణను వుక్కిరిబిక్కిరి చేశాయి. లింగమూర్తితో వైవాహిక జీవితాన్ని కొనసాగించడంపై ఏదో ఒక నిర్ణయం తీసుకోమని ప్రేరేపించాయి.

వీణ వెంటనే లాయర్ని సంప్రదించడం, విడాకుల నోటీస్ లింగమూర్తికి వెళ్లడం చకచకా జరిగిపోయాయి.

జైల్లో ప్రత్యేకంగా ఓ సెల్లో వున్న లింగమూర్తి ఆ నోటీస్‌లోని పదాల్ని ఎన్ని వందలసార్లు చదివాడో! వీణ మీద వుప్పొంగిన ప్రేమ కన్నీరై జారింది.

'నో...అలా జరగడానికి వీల్లేదు...' దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు.

★★★

దిగ్గున లేచి కూర్చున వీణ లింగమూర్తి కలవరింతలతో హడలిపోయింది.

వీపు మీద ఒక్క చరుపుతో చప్పున లేచాడు లింగమూర్తి.

ఒక్కఉదుటున మంచం దిగి పెట్టెలు, అల్మారాలు తీసి చూశాడు. అన్నీ భద్రంగానే వున్నాయి. అయినా కల కలవరపెడుతుండడంతో ఒళ్లంతా నీరసం ఆవహించినట్లయి కుర్చీలో కూలబడ్డాడు.

వీణకేమీ అర్థం కాలేదు. ఎప్పుడూ లేనివిధంగా ఈ వింత ప్రవర్తనేమిటో నన్న సంశయం మనసు నిండా వుంది.

కాసేపటికి తేరుకొని తన స్వప్న వృత్తాంతమంతా పొల్లుపోకుండా చెప్పాడు.

'అవునండీ...టపాసులతో తమాషాలు కాదు....' త్వరగా వాటిని బయటకి పంపేయాలన్న ఆత్రుతలో వుంది వీణ.

మరొక్కసారి వెళ్లి అల్మారాలు, అట్టపెట్టెలు తెరిచాడు లింగమూర్తి. ఇరవై సంవత్సరాల నుంచీ గిన్నీస్ బుక్ రికార్డ్ కోసం తాను దాచిపెడుతున్న ఎన్నో రకాల బాణాసంచా దీనంగా కనపడింది.

రికార్డులకన్నా కూడా ఇన్నాళ్ల తమ అనుబంధం తెగిపోబోతోందని భోరుమన్నాడు. వచ్చే దీపావళితో తన మిత్రుల్ని శాశ్వతంగా దూరం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

దీపావళి వచ్చింది. తన 'రికార్డ్' మందుగుండు సామాగ్రిని తీసి వసారాలో వరుసగా పేర్చాడు. ఓ ఇరవై కుటుంబాలు వారం రోజులు నాన్‌స్టాప్‌గా కాల్చేన్ని వున్నాయి.

ఇళ్ల ముందు ప్రమిదల వెలుగులు మొదలుకావడంతోనే వీధిలో చిన్నగా కాకరపూలు, చిచ్చుబుడ్లు, కాలడం మొదలయ్యాయి.

కాసేపడికి ఊరంతా తిరిగి ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితం ముక్కలు ఏరుకునే పిల్లలు ఓ పదిమంది టపాసులు లేని బాధను దిగమింగుకుని కాల్చేవారి ముఖాల్లో ఆనందాన్ని చూడడానికి వచ్చారు.

లింగమూర్తి వితరణ మొదలైంది. ఆ పదిమంది పిల్లల్ని పిలిచి తలా ఓ సంచీడు టపాసులిచ్చాడు. వారి ముఖాలు మతాబుల్లా వెలిగిపోయాయి. మిగిలిన వాటిని బజారులోని ప్రతి ఇంటికీ పంచాడు. స్టాక్ క్లియరై మనసు ఎంతో ప్రశాంతంగా మారింది. దీపావళి ఎంతో ఆనందంగా గడిచింది.

★